# మమత - మానవత

సన్నగా మూలుగు వినపడింది.

అటూ యిటూ గస్తీ తిరుగుతున్న నేను ఆగాను.

అతను బలహీనంగా కళ్ళు తెరిచాడు.

దృఢంగా నిర్మింపబడ్డ ఆ ఖైదు తలుపుల దగ్గరకు వెళ్ళి అతని వేపు దీనంగా చూశాను.

"దా...హం! దా...హం!" ఒక్కొక్క అక్షరమే పలికాడు, ఆ వృద్ధుడు. ఆ మాటలు కూడా ఎంత కష్టంగా పలుక గలిగాడో నాకు తెలుసు.

ఏమీ మాట్లాడక అలానే అతని వేపు చూస్తూ నుంచున్నాను.

అతను నాలికను బయట పెట్టాడు - ఎండిపోయిన నాలికను తడిచేసుకోవటానికి ప్రయత్నించాడు. బాధగా కళ్ళు మూసుకున్నాడు!

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగినయ్!

అతని కోసం ఏదయినా చేయాలి... కాని.... ఎలా? తల ప్రక్కకి తిప్పి చూశాను. మెట్ల మీద కాపలావాళ్ళు నేనక్కడ ఆగటం చూసి నా వేపు దీక్షగా చూస్తున్నారు.

లేదు... నేను అసహాయుడిని. అవతలి మనిషి ప్రాణం, దాహంతో విల విల్లాడి - అన్యాయానికి ఆహుతి అవుతుంటే చూస్తూ వూరుకోవలసిందే కాని నే నేమీ చేయలేను - ఏదయినా ప్రయత్నం చేస్తే మరుక్షణంలో నా ప్రాణం పోవటం ఖాయం.

అతను మళ్ళీ నీరసంగా మూలిగాడు. నాలికను బయటపెట్టి ఆడిస్తున్నాడు. ఆ వృద్ధుడి నాలికకు తడి అందటం లేదు. చేతులతో పొట్ట మీద వత్తుకుంటూ - పేగుల్ని నలిపేసుకుంటున్నాడు. మనిషి మెలికలు తిరిగిపోతున్నాడు. కళ్ళు ఎర్ర బారి నా మానవత్వాన్ని సవాల్ చేస్తున్నాయ్. వాటిలో నీళ్ళు లేవు! బహుశా ఏడ్చి ఏడ్చి, అవీ యింకిపోయినయ్ కాబోలు. చూస్తుండగానే విలవిలా తన్నుకున్నాడు. చేతులూ, కాళ్ళూ బలహీనంగా ఆడించాడు - కాసేపటికి అలసి సొలసి సొమ్మసిల్లి పోయాడు!

నా గుండెలవిసిపోయినయి. నరకంలో మానవుడెన్ని బాధల ననుభవిస్తాడో తెలీదు కాని మరీ యింత ఘోరమైన శిక్ష ననుభవించడేమో ననిపించింది. మహారాజు విక్రమదేవుడికి... యిక నిష్కృతి లేదు. ఎంత తప్పు చేసినా, సాటి మానవుని యింతగా హింసించటానికి మరో మానవునికి హక్కు లేదు. కాని ఈ మహారాజు దుర్మార్గుడు - న్యాయాన్యాయాలతో పనిలేని పశువు. తను నమ్మిందే శిరోధార్యం.

ఈ వృద్ధుడు రామరాజు - చాల నెమ్మదైన వ్యక్తి. నిష్కల్మషుడు - నిర్మల హృదయం కలవాడు. నిష్కపటి - అన్నిటికి మించి అతను నిర్దోషి. విపరీత మైన రాజభక్తీ, దేశభక్తిగల రామరాజు దేశద్రోహిగా ఆరోపింపబడటం - దేశ దౌర్భాగ్యానికి నాంది కాక మరేమిటి? ఆ అన్యాయమైన ఆరోపణలను - ఆలోచనలేక - నమ్మి, అతనికి దండన విధించిన మహారాజు విక్రమదేవుడు క్షమించతగ్గ వాడు కాడు! అంతగా అతను దోషి అని నమ్మినపుడు - అతనికి ఒక్కసారిగా మరణదండన విధించవలసింది - ఈ బాధలు లేక హాయిగా కన్ను మూసేవాడు, నిద్రాహారాలులేక - చనిపోయేదాకా నిత్య నరకం అనుభవించమని శాసించటానికి విక్రమదేవుడికి ఎవరిచ్చారీ అధికారం? యిప్పటికి షుమారు నెలా యిరవై రోజుల నుండి ఆహారమివ్వక - ఆఖరికి గుక్కెడు మంచినీరైనా అందివ్వక కనీసం నిద్రయినాపోనీయక - అతన్ని అంతగా బాధించి, మహారాజు సాధించేదేమిటి?

చాలామందికి తెలును రామరాజు 'నిర్దోషి' అని. కాని... ఎవరు... ముందుకు వచ్చేది? రామరాజు ఒక పది నిముషాలు కునుకుతీశాడని - తన విధి నిర్వర్తించలేదనే నెపం మీద మహారాజు ఆ కాపలాదారుడిని అన్యాయంగా ఉరి తీయించాడే! - రామరాజుపై ఆరోపణలు అన్యాయమని, ఆక్రోశించిన ఒక పౌరుడిని నిండు సభలో నిలబెట్టి హతమార్చాడే... అటువంటి విక్రమదేవుడి ముందు తల ఎత్తే దెవరు? న్యాయం కోసం పోరాడేదెవరు?

మెట్లవద్దనున్న కాపలావాడు కేకేశాడు నన్ను, "అతను - నిద్రపోతున్నా డేమో చూడు - నిద్రపోతుంటే లేపు" అన్నాడు.

అటు చూశాను. రామరాజు కన్ను మూస్తున్నాడు. నేను నిస్సహాయుడిని! ఈ పాపంలో నేనూ పాలుపంచుకోక తప్పదు -- నా ప్రాణం కోసం నేనూ కొంత పాపం చేయాలి కావును! చేతిలో వున్న కర్రతో నేల మీద కొట్టి అతన్ని లేపాను --

నీరసంగా, కళ్ళు తెరిచి, నిర్లప్తంగా చూశాడు నన్ను. మెట్ల మీద వున్న కాపలావాడికి వినపడేటట్లు అన్నాను - "కాసేపు కూర్చో. పడుకుంటే నిద్రవస్తుందేమో!" అని.

అతను అదో రకంగా నవ్వాడు. ఆ నవ్వులో జీవం లేదు, ప్రాణం లేదు, ఏమీ లేదు. కాని ఏదో అర్థం వుంది. నా నిస్సహాయత అతనికి నవ్వు తెప్పిస్తోందా... ఏమో..

చేతిలోని కర్రను వూపుతూ అటూ యిటూ గస్తీ తిరగసాగాను.

వృద్ధుడు "దా....హం...దా...హం" అన్నాడు.

నేను వినిపించుకోనట్టు చూశాను.

అతని కళ్ళు దీనంగా అర్థిస్తున్నట్టు వున్నాయ్! కళ్ళల్లో నీళ్లు కాని, రక్తం కాని వున్నట్టు లేవు. పాలిపోయిన కళ్ళ నల్లని జీరలు అతని నిర్దోషిత్వానికి ప్రతీకగా నిలచినయ్!

నోరు తెరిచాడు. అతి కష్టంమీద నోట్లోంచి మాట పెగిలింది.

"దాహం... మంచినీళ్ళు... నీళ్లు..." అన్నాడు తల వాల్చి.

నా హృదయం కరిగిపోయింది. గుండెల్లో ఏదో పెట్టి దేవినట్లయింది --

మానవత్వానికి విలువలు నశించినయ్! మానవుడు రాను రాను దానవుడయి పోతున్నాడు. సాటి మానవుడిని చిత్రవధ చేసి తన మానవత్వాన్ని మంట కలుపుకుంటున్నాడు. హృదయంలో ఏ మాత్రం జాలి, కరుణ లేకుండా చేసుకుంటున్నాడు. జంతువులకన్నా హీనంగా బ్రతుకుతున్నాడు. భగవాన్! ఏమిటీ వికృత పరిస్థితి? మంచికి విలువ ఎక్కడ? ఎప్పుడు? ఒక మానవుడి పశుత్వాని కింకొకడు ఇలా కృంగి, కృశించి, నశించి పోవలసిందేనా? నేనీ బాధ చూడలేను. చూస్తూ బ్రతకలేను - కాని... ఏం చేయను... నా ప్రాణం నాకు తీపి. స్వార్థం వద్దంటున్నది. కనీసం నన్నిక్కడ నుంచి యింకో చోటుకి మారిస్తే బాగుండును. ప్రత్యక్షంగా అతని నరకయాతనను చూస్తూ ఎలా భరించగలను? --

'హే భగవాన్! నువ్వయినా ఆ పండి పోయిన ముసలివాడిని త్వరగా నీ దగ్గరకు తీసుకుపోయి - అతన్నీ బాధ నుండి విముక్తి చేయి!' - భగవంతుని తలచుకొని చేతులు జోడించటం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు.

ఇంతలో మెట్ల దగ్గర అలికిడిఅయింది. ఉలిక్కిపడి అటు చూశాను. ఒక యువతి - బహుశా బాలింత. బాలింతకాక మరేమిటి - ఆమె చేతిలో వున్న పచ్చని పసికందు కనపడుతూనే వున్నాడు. తల వంచుకొని గబగబా వస్తున్నది. ఆమె వెనుక ఒక యువకుడు ఆదుర్దాగా వస్తున్నాడు.

వారితో వస్తున్న ఒక సైనికుడు నన్ను కేక వేసి, "సరిగ్గా అయిదు నిముషాల పాటువారిని ఖయిదులోకి వదులు-అతనితో మాట్లాడగానే వారిని పంపివేసి తలుపు వెయ్! ఇది మహారాజుగారి ఆజ్ఞ!" అని గట్టిగా అరిచాడు.

నేను తల వూపాను.

ఆ సైనికుడు ఆ యువతి దగ్గరా - యువకుడి దగ్గరా ఏవయినా ఆహార పదార్థాలు వున్నాయేమోనని క్షుణ్ణంగా వెతికాడు. వారి దగ్గర అటువంటివేమీ లేవని గట్టిగా నిర్ణయించుకున్న తరువాతనే వారికి లోనికి వెళ్ళటానికి అనుమతి యిచ్చి తను వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు నాతో "జాగ్రత్త!" అని చెప్పి కూడా వెళ్ళాడు.

చేతిలో పసికందుతో ఆ పచ్చి బాలింతరాలు హడావిడిగా పరుగెత్తు కుంటూ వచ్చి కటకటాలలోనించి చూస్తూ ఆతృతగా "నాన్నా!" అని పిలిచింది.

గదిలో ఖైదు చేయబడ్డ ఆ వృద్ధుడు తల ఎత్తాడు. అతని కళ్ళల్లో మొదటిసారిగా ఒక మెరుపు మెరిసింది. ముఖంలో ఆనందం కనపడింది. ఆ ఒక్క చూపులోనూ కోటి అర్థాలు స్ఫురించినయి.

"ను...వ్వా... ...త...ల్లీ..." అన్నాడు ఒక్కొక్క అక్షరాన్నే వత్తి పలుకుతూ.

తలుపు తీసి వారిని లోనికి వదిలాను. ఆమె చకచకా వెళ్ళి తండ్రిని గాఢంగా కౌగిలించుకున్నది. ఆమె కళ్ళ నుండి నీరు కన్నీరై పారింది. ఆ వృద్ధుడు ఆ కన్నీళ్ల తోనే నోరు తడుపుకున్నాడు.

ఆమె ఆ వృద్ధుని పరికించి చూసి ఒక్క సారిగా భోరుమని ఏడ్చింది. ఆమెతో వచ్చిన యువకుడు ఆమె భర్త కాబోలు ఆమె తలపై చేయి వేసి నిమిరాడు.

ఆమె తన తండ్రి కళ్ళల్లో ఎన్నో అర్థాలు చదవగలిగింది. తండ్రి ముఖంలో ఎన్నో

భావాలను చూడగలిగింది.

అతను నీరసంగా అన్నాడు "పిల్లవాడేడమ్మా?!!" అని--

పసికందుని అందించిందామె. మనుమడిని తనివితీరా చూసి ముద్దులాడేడు తాత-

యువకుడు వృద్ధుని వీపు మీద చేయి వేసి ఆప్యాయంగా నిమిరాడు.

అతను కళ్ళెత్తి ఆ యువకుడిని చూసి విచారం ఆపుకోలేక పోయాడు కాబోలు బిగ్గరగా ఏడిచాడు. యువకుడు వృద్ధుని అక్కున చేర్చుకున్నాడు.

కళ్ళల్లో నిలచిన నీటిని తుడుచుకున్నాను.

వృద్ధుడు హఠాత్తుగా ఆమె ఒడిలో వాలిపోయాడు. ఒక విధమయిన గురక పెట్టాడు.

ఆమె బిత్తరపోయింది. ప్రక్కనున్న యువకుడు వృద్ధుని చేతిలోని పిల్లవాడిని అందుకున్నాడు.

వృద్ధుడు కళ్ళు మూసుకున్నాడు. ఈ లోకంలో వున్నట్టు లేదు. అతని పెదిమలు మెల్లగా విచ్చుకున్నాయి.

"దా... హం... దా.....హం..." అన్నాడు మెల్లగా.

ఆమె ఏమీ చేయలేక గుండెలవిసిపోయేలా ఏడిచింది.

యువకుడు తన కళ్ళవెంట ధారాపాతంగా కారుతున్న నీటిని తుడుచుకున్నాడు. గుండె చిక్కబట్టుకొని ఆమె భుజం మీద చేయి వేశాడు.

ఆమె తన తండ్రి పాదాలను కన్నీటితో తడిపి వేసింది. వృద్ధుడు మళ్ళీ "దా... హం! దా...హం!" అన్నాడు. అతని స్వరం ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్టుగా వినపడింది.

ఆమె తన తండ్రి ముఖంలోకి చూసింది.

అతను దీనంగా చూస్తున్నాడు. కళ్లు మూసుకొని తెరుస్తున్నాడు. ముక్కు వణుకుతోంది. పెదిమలు మెల మెల్లగా కదలుతున్నయి.

"దా...హం! నీ...ళ్ళు...దా....హం" మెల్లగా అంటున్నాడు. రాను రాను కంఠస్వరం క్షీణిస్తోంది. మాట వినీ వినపడకుండా వస్తున్నది.

ఆమె నిస్సహాయురాలయిపోయింది. యిక ఆమెకి విలపించటానికి కూడా ఓపిక లేదు!

మెట్ల దగ్గరా కాపలా వున్నవాడు నన్ను పిలిచి కేక వేశాడు --- "వారిని త్వరగా పంపించు - ఆలస్యమవుతుందేమో" అంటున్నాడు.

నేను నోరు విప్పకనే ఆమెకామాటలు వినపడినయి. నా వంక అర్థిస్తూ చూసింది. నా అసహాయత్వానికి నన్నే నిందించుకున్నాను. దోషిలా తల వంచుకున్నాను.

అతను మళ్ళీ "దాహం!" అన్నాడు. అయితే ఈసారి మాట బయటకు వినపడలేదు. అతని పెదిమలూ పూర్తిగా కదలలేదు. కళ్ళు తేలవేస్తున్నాడు.

ఆమెలో ఏదో భావం తళుక్కుమంది!

ఆమె మాతృత్వం పొంగి పొర్లింది! తన తండ్రిలో ఆకలి తీరటం కోసం అర్థిస్తున్న తన పసికందుని చూడకలిగింది!

ఒక క్షణమైనా ఆలస్యం చేయక పమిటె చెంగును తొలిగించింది.

రవిక ముడి విప్పి తన స్థనాన్ని తండ్రి నోటికి అందించింది.

ఆమె ఒడిలో పసివాడిలా అతను తన దాహం తీర్చుకుంటున్నాడు.

నా ఒళ్ళు పులకరించి పోయింది! అనిర్వచనీయమైన అనుభూతి కలిగింది. ఒకప్రక్క మానవుడు దానవుడవుతున్నా మానవత్వపు ఔన్నత్యాన్ని, నిలబెడుతున్న ఆ మాతృ స్వరూపానికి మనసారా నమస్కరించాను! ఏదో వింత ప్రకృతితో నా మనసు తేలిపోయింది. వృద్ధుడు తనేం చేస్తున్నాడో తెలుసుకునే స్థితిలో లేడు. అతనికీ ఆమెలో స్థన్యం గరిపే మాతృమూర్తి, గోచరించింది. పసిపాపలా దాహం తీర్చుకుంటున్నాడు.

ఆమె ముఖంలో అదోవిధమైన తృప్తి అద్వితీయమైన ఆనందం అనిర్వచనీయమైన అనుభూతి. అటువంటి పవిత్ర మాతృమూర్తిని కన్న ఆ తల్లి అదృష్టవంతురాలు.

ప్రక్కనున్న యువకుడు చెమ్మగిల్లిన తన కళ్ళను తనే నమ్మలేక పోతున్నాడు. అతను ఏదో చెప్పాలనుకొని, వణుకుతున్న తన పెదిమలను అదుపులోకి తేలేక ఆమెకు చేతులెత్తి నమస్కరించటం తప్ప వేరే ఏమీ చేయలేక పోయాడు.

మానవత్వానికి ప్రాణం పోసిన ఇంతటి మహోన్నతమైన వ్యక్తులను సృష్టించిన ఆ భగవంతుడు ధన్యుడు.

మెట్ల దగ్గర కాపలావాడు మరలా కేకవేశాడు సమయం మించి పోతున్నట్టుగా.

నేను అడుగు ముందుకు వేశాను.

యువకుడు నా బాధను అర్థం చేసుకున్నాడు. ఆమెను తట్టి లేపాడు.

వృద్ధుని ముఖంలో కొంత కాంతి కనిపించినా అతను పరిసరాలను గుర్తించేస్థితిలో లేడు.

ఆమె లేచి తండ్రి పాదాలకు నమస్కరించింది. పసివాడి చేత తాత పాదాలకు నమస్కారం పెట్టించింది. యువకుడూ వృద్ధుని కాళ్ళను కళ్ళ కద్దు కున్నాడు.

బరువు హృదయాలతో వెనుదిరిగారు.

తలుపు వేశాను!

మెట్లెక్కి వెళ్ళి పోతున్న వారిని చూసి చేతులు జోడించాను.

అలా ఎంతోసేపు ఆలోచిస్తూ గస్తీ తిరుగుతున్న నన్ను, మెట్ల వద్దనున్న కాపలావాడు అదిలించాడు. ఖైదు గదిలోకి చూశాను. అతను నిద్ర పోతున్నాడు. లేపటం నా విధి, తలుపు తీశాను. లోపలికి వెళ్ళి అతన్ని లేపాను.

కాని అతను లేవలేదు. యిక లేవలేడు. లేవడు.

అతని ప్రాణాలు అనంత వాయుల్లో లీనమయినాయి.

కాని చనిపోతూ తృప్తిగా చనిపోయాడు, ఆ దురదృష్టవంతుడు.

అతని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించటం తప్ప నేను మాత్రం చేయగలిగిందేముంది.

*(ఆధారం: జార్ ప్రభువుల కాలంలో రష్యాలో జరిగిన ఒక సంఘటన.*

*కృతజ్ఞత: ఆధారం అందించిన శ్రీ గుమ్మడి వేంకటేశ్వరావ్‌కి).* ❋